

నేటి దినపత్రిక

# సూర్య

ఉత్తరాంధ్ర

శనివారం 7-9-2024 పేజీలు 4

www.suryaa.com

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం

విజయనగరం శ్రీకాకుళం


## సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**

విజయవాడ బుడమేరు ముంపు ప్రాంతమైన అజిత్ సింగ్ నగర్‌లోని లూనా సెంటర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం నాటికి కూడా వరద నీరు నిలిచిపోయివుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో బోటులో ఆయా ప్రాంతాలను సందర్శించి బాధితులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ కోసం చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, పవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.

# మీది తెనాలే.. మాది తెనాలే..!




- వైసీపీ, టీడీపీ నేతలు భాయిభాయి
- కార్పొరేటర్లతో 'తమ్ముళ్లు' మిలాఖత్
- ఉభయుల మధ్య క్విడ్ ప్రోకో ఒప్పందం
- ఆసక్తిగా మారిన అవగాహన రాజకీయం

**(ఎం.ఎస్ .ఎన్.రాజు)**
**విజయనగరం బ్యూరో, మేజర్ న్యూస్**

విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలోని వైసీపీ కార్పొరేటర్లు, కొందరు టీడీపీ నేతలమధ్య రంజైన అవగాహన రాజకీయం నడుస్తోందనేది టాక్ ఆఫ్ ది టౌన్! పట్టణంలోని పలువురు వైకాపా నేతలు కార్పొరేటర్లుగా అవతారమెత్తిందే తడవుగా, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అనే మహత్తర కార్యక్రమానికి రిబ్బన్ కట్ చేసేసారు. ఆ క్షణం నుంచీ విసుగు విరామం లేకుండా వీలైనంత వరకు చక్కబెట్టుకుంటూనే ఉన్నారు. అదేదో సినిమాలో అన్నట్టుగా ప్రజలకు వచ్చిన ప్రతి నిధినీ తనదిగా భవించేవాడే సిసలైన ప్రజాప్రతినిధి అన్న డైలాగుకు వాస్తవ రూపం ఇచ్చి కళాపోషణలో తమకు తామే సాటి సుమా అని చాటుకుంటున్నారు. వీరి కళాపోషణ దెబ్బకు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు మాయమైపోయాయి. వీటిలో చిన్నాపెద్దా చెరువుల సంఖ్య శతకం దాటిపోయినట్టు ఒక అంచనా. ఇప్పుడు వీటి ఆనవాళ్లు కూడా కనబడవు. అనగనగా అక్కడో చెరువు ఉండేది అని చెప్పుకోవాల్సి వచ్చినంతగా ఊడ్చి పారేశారు. ఇప్పుడా ప్రాంతాల్లో భవంతులు, విల్లాలు, అపార్టుమెంట్లు, మధ్య తరగతి ఇల్లు దర్శనమిస్తున్నాయి. ఈ భూబాగోతంలో వందలు వేల కోట్ల రూపాయలు చేతులు మారాయి. అధికార యంత్రాంగం యధాశక్తి స్వామిభక్త పరాయణత్వాన్ని ప్రదర్శించి పునీతమయ్యింది. కార్పొరేషన్ పరిధిలో 450 వరకు అక్రమ కట్టడాలు నిటారుగా కనిపిస్తున్నాయి. సదరు కార్పొరేటర్ల కళాపోషణ ఇక్కడ కూడా పనిచేసింది. ప్రజలు తమకు పదవినిచ్చింది పదికాలాలు చల్లగా ఉండాలనికదా మేం ఇదంతా చేస్తున్నది అంటూ అమాయకత్వ అభినయాన్ని ఆస్కార్ కి మించి పండిస్తున్నారు. చల్లగా ఉండాల్సింది మేము కదా అని వారి మాటల్లో లాజిక్ తెలియక ఎవరైనా అడిగితే, ముందు మేం బాగుంటేనే కదా మీ గురించి ఆలోచించగలం అని మరో ఆణిముత్యాన్ని వినిపిస్తున్నారు. ఇలా, గత మూడేళ్ళుగా సూక్తి ముక్తావళి వినిపిస్తూ ప్రేక్షక శ్రోతల చెవిలో పూలు పెడుతూ పబ్బం గడుపుకుంటూ, అప్పటివరకు అంతంత మాత్రంగా ఉన్న వారు అంతలోనే అల్లంత ఎత్తుకు ఎదిగిపోయారు. మూడునెలల క్రితం ప్రభుత్వం మారడంతో కళాపోషణకు మంగళం పాడాలని అనుకున్న సమయంలో, అధికార పార్టీలోని కొందరు ముఖ్య నేతలు స్వచ్ఛందంగా స్నేహహస్తం అందించడంతో దోస్త్ మేరా దోస్త్ అంటూ వాళ్ళు వీళ్ళు కలిసిపోయి మిలాఖత్ రాజకీయాలను ప్రజలకు పరిచయం చేస్తూ నీకది నాకిది అంటూ క్విడ్ ప్రోకో విధానాన్ని అమలు చేస్తున్నారు. కార్పొరేటర్లుగా మీ ఘనకార్యాల చిట్టా తమవద్ద ఉంది.. అయినా మిగతా 2లో

## భోగాపురం విమానాశ్రయం 40 శాతం పనులు పూర్తి

### ప్రపంచంలోనే అత్యున్నత ఎయిర్పోర్ట్‌గా తీర్చిదిద్దుతాం
### -కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



**భోగాపురం, సెప్టెంబర్ 06, మేజర్ న్యూస్**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తి అయ్యాయని, విమానాశ్రయ నిర్మాణాన్ని ఆరు నెలల ముందే పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనుల స్థితిగతుల గురించి అధికారులను, జీఎంఆర్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రన్ వే, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు విలేకరులతో మాట్లాడుతూ, 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయాన్ని పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎయిర్పోర్ట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జిల్లా యంత్రాంగం, స్థానికులు నుంచి కూడా సంపూర్ణ సహకారం అందుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో ప్రతినెలా విమానాశ్రయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. గత నెలలో పరిశీలించే సమయానికి సుమారు 36% పనులు జరిగాయని, ప్రస్తుతం దాదాపు 40 శాతం వరకు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, అత్యాధునిక నమూనాతో ఈ ఎయిర్పోర్ట్ నిర్మాణం జరుగుతోందన్నారు. భూములు ఇచ్చిన నిర్వాసితులకు అన్నివిధాలా న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. ఎయిర్పోర్ట్ పూర్తి అయితే ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందనీ,

### మట్టి గణపతిని పూజిద్దాం...
## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

### జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ పిలుపు

**విజయనగరం, సెప్టెంబరు 06, మేజర్‌న్యూస్**



మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. వివిధ రకాల రసాయనాలను పూసి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల స్థానంలో నీటిలో సులభంగా కరిగిపోయే మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని ఆయన కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ అంబేద్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక విగ్రహాల అలంకరణలో రసాయనాల బదులు సహజమైన రంగులనే వాడాలని, తయారీలో, అలంకరణలో, మిగతా 2లో

### చవితి సందడి షురూ..!
## కిక్కిరిసిన మార్కెట్లు..!



**విశాఖపట్నం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్**

గణపతి ఉత్సవాలకు నగరం ముస్తాబైంది. ఆబాల గోపాలం భక్తిప్రపత్తులతో నిర్వహించే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సంబరాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. విఘ్నాలు తొలగించే అధినాయకుడు, తొలిపూజ అందుకునే విఘ్నేశ్వరుడి ఉత్సవాలు శనివారం వినాయక చవితి రోజు నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. సామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పండగ సందడి మొదలైంది. ప్రధాన కూడళ్లలో ప్రత్యేకించి వేసిన ఉత్సవ పందిళ్లు, ఆలయాల వద్ద వినాయక విగ్రహాలు కొలువుదీరనున్నాయి. చిన్న నుంచి భారీ సైజుల్లో విగ్రహాలు తయారు చేసేందుకు కళాకారులు సిద్ధమయ్యారు. వినాయకచవితి కమిటీలు తమకు కావల్సిన ఆకారాలు ముందుగానే ఆర్డర్లు చేసి విగ్రహాలు తయారు చేసుకుంటున్నారు. గతంలో కంటే భిన్నంగా ఉత్సవ కమిటీలు పోటీపడి మరి ఏర్పాట్లు చేస్తున్నారు. అందమైన పందిళ్లతో పాటు భారీ విగ్రహాలు నెలకొల్పుతున్నారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకలకు పెద్ద ఎత్తున పందిళ్ళు వేసి ఎవరి శక్తి మేరకు వారు ఉత్సవాలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. వివిధ రూపాల్లో తయారు చేస్తున్న విగ్రహాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రసాయనిక విగ్రహాలు వద్దు.. మట్టి ప్రతిమే మేలు.. గతంలో ఎక్కువగా మట్టితో చేసిన మిగతా 2లో

## ఉత్తరాంధ్రను ఆనుకుని అల్పపీడనం

### 8 వరకు భారీ వర్షాలు -గరిష్ఠంగా 40 కిలోమీటర్ల వేగంతో గాలులు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్**

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలను ఆనుకుని అల్పపీడనం ఏర్పడింది. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు రుతుపవన ద్రోణి తూర్పు బంగాళాఖాతం వరకు విస్తరించి ఉంది. దీంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖలోని వాతావరణ శాఖ శుక్రవారం వెల్లడించింది. శని ఆదివారాల్లో వారం ఉత్తరాంధ్ర, యానాం ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అదే సమయంలో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వివరించింది. దక్షిణ కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మిగతా 2లో




## 837 మంది డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలిక రద్దు

### హెల్మెట్ లేకుండా బైక్ నడిపినందుకు 3 నెలలు సస్పెన్షన్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్**

హెల్మెట్ లేకుండా బైక్ నడిపిన ద్విచక్ర వాహనదారులపై పోలీసులు చర్యలకు దిగుతున్నారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా విశాఖలో దాడులను ముమ్మరం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండాను, వెనుక కూర్చున్న వ్యక్తులు కూడా హెల్మెట్ ధరించకుండా తిరుగుతున్న వాహనదారులపై పోలీసు శాఖ కేసులను నమోదు చేసింది. వాటిలో 837 మంది డ్రైవింగ్ లైసెన్సులు 3 నెలల పాటు సస్పెండ్ చేశామని ప్రకటించారు. ఈనెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు 2325 కేసులు నమోదు చేయడం జరిగిందని, వాటిలో 837 మంది డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి తనిఖీలు నిర్వహించనున్నామని విశాఖపట్నం జిల్లా రవాణా శాఖ ఉప కమీషనర్ జి సి రాజ రత్నం శుక్రవారం ఒక తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపిన వారు , వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలి అని కోరారు. అలా ధరించక పోతే వారివురి కేసులు నమోదు చేసి డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేయడం జరుగుతుందని డి టి సి తెలిపారు. తల్లి తండ్రులు మైనారిటీ తీరని పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని కోరారు. అలాగే, ట్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడరాదని ఆయన కోరారు.



### వైసీపీ క్రిష్టియన్ మైనార్టీ
## రాష్ట్ర అధ్యక్షులుగా జాన్ వెస్లీ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగ అధ్యక్షులుగా బొల్లవరపు జాన్ వెస్లీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రిష్టియన్ మైనారిటీ విభాగ ఛైర్మన్‌గా ఆయన సేవలందించారు. రెండు దఫాల పాటు క్రిష్టియన్ మైనార్టీ ఛైర్మన్‌గా ఆయా వర్గాలకు సేవలందించారు. దీంతో ఆయనపై వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకం పెట్టుకున్నారు. తిరిగి రాష్ట్ర మైనార్టీ ఛైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ తమ అధినేత వైఎస్ జగన్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## మట్టి గణపతి పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి

### స్పీకర్ అయ్యన్న పాత్రుడు



**నర్సీపట్నం, సెప్టెంబరు 6, మేజర్‌న్యూస్**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తెలుగు రాష్ట్ర ప్రజలకు పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి పూజను ప్రోత్సహిస్తూ, ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మట్టిలో పరమాత్మను దర్శించే అద్భుతమైన తత్వ దర్శనం, యోగదర్శనం పార్థివ గణపతి పూజలో ఉన్నది గనుక . వినాయక చవితికి గణపతిని మట్టితో తయారు చేయాలని పురాణాది శాస్త్రాలు సూచిస్తున్నాయి. అలాగే, ప్రజలకు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినాయక చవితికి మట్టి గణపతిని మాత్రమే పూజిద్దాం అని రాష్ట్ర ప్రజలను పిలుపునిచ్చారు. ప్రజలందరకు వినాయక చవితి సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలియజేశారు.




## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం




మాడుగుల, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:

గత 12 సంవత్సరాలుగా భారత నిర్మాణ సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ భాగంగా మట్టి వినాయక ప్రతిమలు ప్రతి సంవత్సరం ఉచితంగా ప్రజలకు అందిస్తున్నారు. మట్టి వినాయకుని పూజించడం వల్ల అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని మట్టి వినాయకుని పూజించడం ఆరోగ్యం సంప్రదాయమని మాడుగుల ఎస్సై నారాయణరావు తెలియజేశారు. మొదటి విగ్రహం విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ స్టూడెంట్స్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాధు శ్రీనివాసరావు, సూర్యనారాయణరాజు, బొమ్మిశెట్టి శ్రీను, మండల సతీష్ , పెరుమాళ్ళ వెంకట్రావు, మాడుగుల ప్రజలు, గ్రామ పెద్దలు భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు, శ్రీ విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారాది బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్

బొబ్బిలిరూరల్, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:



పారాది నుండి బొబ్బిలి కి వర్షంలో నడుచుకు వస్తున్న రోడ్డు ప్రయాణీకులు, ఇరువైపులా వాహనాలు రాకపోకలు తో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయింది. పారాది హైవే బ్రిడ్జి మీద గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయినందుకు కారణం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దీనిమీద దృష్టిసారించాలని ప్రజలు కోరుకుంటున్నారు. అనంతరం సీఐ సతీష్ కుమార్ ఆదేశాలతో పోలీసు లు ట్రాఫిక్ సరిదిద్దడం జరిగిందని సిఐ తెలిపారు.

## మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన జనసైనికులు

మెలియాపుట్టి, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:



మెలియాపుట్టి మండల కేంద్రంలో శుక్రవారం మండల జన సైనికులు 1000 మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భముగా జనసేన నాయకులు దుక్క బాలరాజు మాట్లాడుతూ జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పిలుపుమేరకు, జనసేన పాతపట్నం నియోజకవర్గ నాయకురాలు కోరికాన భవాని ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు దుక్క బాలరాజు, బీజేపీ నాయకులు సలాన రాఘవరావు, నక్క వెంకటరావు, జనసేన నాయకులు సవలాపురం చంటి,చింతల ప్రశాంత్, సన్నో రతో,పిట్ట హరికృష్ణ, ఈశ్వర్ రెడ్డి, శోభనబాబు, పోలాకి మురళీ కృష్ణ, గంప శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే శంభంగి గ్రామం పక్కి నుండి టీడీపీకి వలసలు

### బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి.ఎస్.కే.కే.రంగారావు (బేబి నాయన) ఆధ్వర్యంలో పక్కి గ్రామం నుండి టీడీపీ లోకి చేరిన 45 కుటుంబాలు

బొబ్బిలిరూరల్, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:



మండలంలోని పక్కి గ్రామానికి చెందిన శంబంగి మజ్జన్న గారి సత్యనారాయణ, బంకురు సత్యం నాయుడు , వారి కుమారుడు మురళీమోహన్, ఎస్సీ కాలనీ కి చెందిన 45 కుటుంబాలు శుక్రవారం తెలుగు దేశం పార్టీ లో చేరారు. ఈ మేరకు బొబ్బిలి కోటలో టీడీపీ సీనియర్ నాయకులు బంకురు బాబురావు మరియు మరడ రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీ బాబినాయనసమక్షంలో తెలుగుదేశంలో చేరడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ పార్టీలో విసిగి తెలుగు దేశం పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు.

## 95 రోజుల కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.5.66.892

కోటబొమ్మాళి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గల ఆరు ధర్మహుండీలు 95 రోజులకు లెక్కించగా రూ. 5.66.892లు ఆదాయం వచ్చిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకిష్ణ శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జీ.వి.బి.ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో ఈ హుండీల లెక్కింపు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ సిబ్బంది, స్థానిక పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోటబొమ్మాళి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో సిహెచ్. హైమావతి అన్నారు. శుక్రవారం మండలంలోగల లఖందిడ్డి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, బాలింతలకు పిల్లలకు అందించే పోషణపై, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణీలు పాటించవలసిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారం ప్రమాణాలు అంగన్వాడీ ద్వారా వారికి పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో కె. రూపలత, సూపర్‌వైజర్లు సత్యప్రియ, పద్మలత , హెల్త్ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు బమ్మిడి గణపతిస్వామి, కర్రి అప్పారావు, కర్రి చెల్లయ్య, శివరాం, తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య చర్యలు పటిష్టంగా చేయాలి: ఎంపీడీవో

మెలియాపుట్టి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



వర్షాలు కురుస్తున్నందువలన అంటు వ్యాధులు ప్రబలకుండా మండలంలో అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య, క్లోరినేషన్ చర్యలను పటిష్టంగా చేయాలని మెలియాపుట్టి ఎంపీడీవో పి చంద్రకుమా రి అన్నారు. శుక్రవారం మెలియా పుట్టి మండలంలోని భరణికోట, టకోయ గాథలవలస, జోడూరు, బగడ, చాపరా , తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమెతోపాటు ఏవో తిరుపతి పట్నాయక్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## మట్టి గణపతినే పూజిద్దాం...పర్యావరణాన్ని కాపాడుదాం

కోటబొమ్మాళి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:

పర్యావరణ పరిరక్షణకు మనమంతా మట్టి గణపతిని పూజిద్దామని స్థానిక వంశధార విద్యా సంస్థల అధినేత చింతాడ అనిరుద్రుడు అన్నారు. ఆయన శుక్రవారం వంశధార విద్య సంస్థలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉచితంగా మట్టిగణపతిలను పంపిణీ చేశారు. పీఓపి, సింథటిక్ రంగులు, ప్లాస్టిక్‌తో తయారుచేసిన వినాయక విగ్రహాలు వాడటం వల్ల అనారోగ్యకు, క్యాన్సర్ బాదిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అందుకే ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

### -మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి, పాతపట్నం నియోజకవర్గం

పాతపట్నం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



మనం జరుపుకునే ముఖ్యమైన పండుగలో వినాయక చవితి ఒకటి. ఏ శుభకార్యాలు అయినా యజ్ఞయాగాదులు అయినా మొదలు పెట్టాలంటే కచ్చితంగా మొదట వినాయకుడిని పూజిస్తాం, అంతేకాదు మనం కొత్తగా ఏ పని మొదలుపెట్టినా..ఆ పని ఏ విఘ్నాలు లేకుండా పూర్తి కావాలంటే వినాయకుడు అండగా ఉండాలని తొలి పూజ నిర్వహిస్తాం. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని రంగులు ఉపయోగించని విగ్రహాలను ప్రతిష్టించి జలాశయాలను కలుషితం కాకుండా చూడాల్సిన భాద్యత మనందరిపైన ఉంది. మీరు చేసే ప్రతీ కార్యం ఆ వినాయకుడి ఆశీస్సులతో విజయం కావాలని, వినాయక చవితి పండగ రోజున మీరందరూ ఆనందంగా గడపాలని మనసారా కోరుకుంటూ. ఆ విఘ్నాదిపతి మీకు క్షేమ, స్థైర్య ఆయురారోగ్యాలు సిద్ధించాలని, సుఖసంతోషాలు చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. మీకూ, మీ కుటుంబ సభ్యులకు వినాయక చతుర్థి శుభాకాంక్షలు.

## రోడ్డు ప్రమాధంలో ఇద్దరికీ గాయాలు

కోటబొమ్మాళి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్



మండలం జాతీయరహదారి జర్జంగి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాధంలో ఇదే మండలం సరియాబొడ్డపాడు గ్రామానికి చెందిన సనపల తవిటయ్యతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి స్థానిక 108 సహాయంతో స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే సనపల తవిటయ్యతో పాటు మరో వ్యక్తి ద్విచక్రవాహనం పై కోటబొమ్మాళి నుంచి సరియాబొడ్డపాడు గ్రామం వైపు వెలుతుండగా టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెలుతున్న కారు స్పీడుగా వచ్చి ద్విచక్రవాహనం ఢకొట్టి పారిపోయి నిమ్మాడ నుంచి మరళ వెను తిరిగి పలాస వెలుతుండగా హైవే పెట్రోలింగ్ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## మోడల్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం

నరసన్నపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



ఈదులవలస ఆంధ్ర ప్రదేశ్ మోడల్ స్కూల్ కళాశాల పేరెంట్స్ కమిటీ మీటింగ్ ను ఎస్ఎంసి చైర్మన్ దండుపాటి ఎర్రయ్య అధ్యక్షతన, ప్రిన్సిపల్ పైడి ప్రవీణ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులకు ప్రిన్సిపల్ అభినందనలు తెలియజేశారు. అనంతరము ఆమె మాట్లాడుతూ మోడల్ పాఠశాల అభివృద్ధికి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తన సహాయ సహకారాలు అందించాలని, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు మోడల్ పాఠశాల అభివృద్ధికి దోహదపడేదిగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పేరెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

### ఎమ్మెల్యే మామిడి గోవింద రావు

పాతపట్నం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



పాతపట్నం పంచాయతీ కార్యాలయం ఆవరణలో 1000 మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎం.జీ.ఆర్ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ,మట్టి విగ్రహాలనే పూజించాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు ముందుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ,పర్యావరణ పరిరక్షణ కొరకు మట్టి విగ్రహాలనే పూజించాలనే ఉద్దేశ్యంతో పాతపట్నం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సుమారు 1000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన పాతపట్నం నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు శ్రీ మామిడి గోవింద రావు గారు,అలాగే నియోజకవర్గ ప్రజలందరూ మట్టి విగ్రహాలనే పూజించాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో పైల బాబ్జి,సిర్ల ప్రభాకర రావు, జోగారావు,అక్కంధ్ర సన్యాసి రావు, శాసనపురి బుల్లిబాబు,శివాల చిన్నయ్య, నిందిగాం ఆనందరావు, కరకవలస మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆవుకు శస్త్రచికిత్స చేసి 15కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు

### తీసిన డాక్టర్ కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



నరసన్నపేట మండలం, మడపాం గ్రామానికి చెందిన మర్ల గోపాలరావునకు చెందిన ఆవు గత 10 రోజుల నుండి పొట్ట ఉబ్బరం, మేత మందగించటం, నడవలేకపోవటం వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో గురువారం మధ్యాహ్నం కురుదు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్‌ను సంప్రదించగా ఆయన వెంటనే కోటబొమ్మాళి ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకురావలని సూచించగా వారు సంచార పశువైద్య వాహనం ద్వారా సాయంత్రం తీసుకువచ్చారు.. డాక్టరు ఆవును పరిశీలించిన పిదప ఆవుకు శస్త్రచికిత్స చేసుకోమని రైతుకు సలహా ఇవ్వవా రైతు అంగీకారంతో శస్త్రచికిత్స చేసి పొట్టని కోసి పొట్టలోఉన్న సుమారు 15 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు అయినటువంటి ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ త్రాళ్ళ ముక్కలని తీశారు. ఆవు క్షేమంగా వాహనంలో ఇంటికి పంపడం జరిగినది. ఆహారం, నీరు తీసుకుని ఆవు క్షేమంగా ఉంది. దీంతో రైతు గోపాలరావు ఆనందం వ్యక్తం చేస్తూ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

### : సి.ఐ, జె. శ్రీనివాసరావు

– బడి పిల్లలను తరలించే ఆటోచోదకులు జాగ్రత్తలు పాటించాలి.

నరసన్నపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



నరసన్నపేట సర్కిల్ కార్యాలయంలో సీ.ఐ, జె. శ్రీనివాసరావు ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణికులను వారి గమ్యస్థానాలు చేర్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో ఎక్కించుకోరాదని, డ్రైవర్ సీట్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవదదని, నిర్ణీత స్టాండర్డ్ లోనే ఆటోలు ఆపి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఆటోలను తిప్పుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించని, అపరిమిత ప్రయాణికులతో రవాణా చేసే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా బడి పిల్లలను రవాణా చేసే ఆటో వాళ్ళు పరిమితికి మించి పిల్లల్ని ఎక్కించుకొని, విపరీతమైన సౌండ్ సిస్టంతో వాహనాలు నడుపుతున్నట్టు మా దృష్టికి వచ్చిందని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆటోచోదకులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని హామీ ఇచ్చారు.

## భైరవ చెరువును పరిశీలిస్తున్న

### మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, సెప్టెంబర్ 06, మేజర్‌న్యూస్:



పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి జలమయమైన వివిధ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్ ఎల్అ. రామలక్ష్మి పరిశీలించారు. ఈ మేరకు అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీరు వారితో వర్షం నీరు తరలించడానికి చర్చలు జరిపారు. అనంతరం భారీ వర్షం కురవడంతో జలమయమైన వివిధ ప్రాంతాలలో నిలిచిపోయిన నీటిని బయటకు తోడుటకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. భైరవి సాగరం చెరువులో నీరు ఎక్కువగా చేరుతుండటంతో నీరు బయటకు పోవుటకు ఉన్న మార్గాలను పరిశీలించారు. టిబిఆర్ థియేటర్ రోడ్డు, జయప్రకాష్ స్కూల్ రోడ్డు, బైపాస్ రోడ్డు, ఫుల్ బాగ్ మరియు టిటిడి కళ్యాణమండపం రోడ్డులో నిలిచిపోయిన నీటిని వ్యాక్యూమ్ ట్యాంకర్ తో అత్యవసరముగా బయటకు తోడివేయించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

## చేయూత సంస్థ ఆధ్వర్యములో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ




లక్కవరపుకోట, సెప్టెంబర్ 06, మేజర్‌న్యూస్:

మండలములోని తలారి గ్రామకేంద్రంగా పని చేస్తున్న చేయుత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యములో శుక్రవారం 250 మట్టి వినయక విగ్రహాలను వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామస్థులకు అందజేసినట్లు సంస్థ కార్యదర్శి గుమ్మడి శ్రీనివాసరావు తెలిపారు ప్లాస్టర్ అఫ్ పారిస్ విగ్రహాలను వాడి చెరువుల్లో కాలువల్లో నిమజ్జనం చేయడము వలన నీటి కాలుష్యము వాయు కాలుష్యము ఏర్పడుతుందని అందుకే అందరూ మట్టి విగ్రహాలనే వాడాలని పర్యావరణాన్నీ కాపాడాలని కోరారు ఈ కార్యక్రమము లో ముమ్మన రమణ కె నరసింహ గుమ్మడి జగన్నాధం త్రినాధ్ పాల్గొన్నారు.

## "ప్లాటినం 22 గుడ్ ఫ్రెండ్స్" వినాయక మట్టి ప్రతిమల పంపిణీ

నరసన్నపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



నరసన్నపేటలో గురువారం ప్లాటినం 22 గుడ్ ఫ్రెండ్స్ తరపున మట్టి వినాయక ప్రతిమలు, వ్రత కథ పుస్తకము మారుతి నగర్ జంక్షన్ దగ్గర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్లాటినం 22 గుడ్ ఫ్రెండ్స్ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా వహించారు. పలు సేవా కార్యక్రమాలను 22 గుడ్ ఫ్రెండ్స్ నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామని దానిలో భాగంగా ప్రకృతి పరిరక్షణకు వినాయక ప్రతిమలు పంపిణీ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, స్థానికులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, చేతనైన సహాయం చేస్తామని గ్రూప్ సభ్యులు ముక్తకంఠంతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాటినం 22 గుడ్ ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షులు సింగూరు శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ తంగుడు విజయ్ కుమార్, సెక్రెటరీ వారణాసి బుజ్జి, ట్రెజరర్ నూలి సురేష్ కుమార్, గ్రూపులోని మిత్రులందరికీ పాల్గొన్నారు.

## లైంగిక దాడులపై,పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలి

### బొబ్బిలి పట్టణ సిఐ సతీష్ కుమార్

బొబ్బిలి, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:



సెవెంత్‌డే అడ్వెంటిస్ట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు అధ్యక్షతన జరిగిన పిల్లలపై లైంగిక దాడులు అనే కార్యక్రమానికి, బొబ్బిలి టౌన్ ఇన్స్పెక్టర్ కే సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా ఇంటి వద్ద నుంచి పాఠశాలకు వచ్చే మార్గంలో తెలియని వ్యక్తులతో మాట్లాడవద్దని, వారిచ్చే బహుమతులు గాని,ఆహార పదార్థాలు గాని తీసుకోవద్దని తెలియజేశారు.ఎవరైనా అసభ్యకరంగా పట్టుకున్న, ముట్టుకున్న,తల్లిదండ్రులు గాని లేదా ఉపాధ్యాయులకు గాని తెలియజేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించా రు.ముఖ్యంగా యుక్త వయసులోకి వచ్చే ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

## పీఎం జన్మన్ పథకంపై అవగాహన

మెలియాపుట్టి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



మెలియాపుట్టి మండలం బందపల్లి గ్రామంలో పీఎం జన్మన్ పథకం పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించినట్లు ఎంపీడీవో పి చంద్రకుమారి తెలిపారు. ఈ అవగాహన సదస్సులో పీఎం జన్ ధన్, పీఎం కిసాన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల కొరకు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యక్తిగతంగా, ఆర్థికముగా, సామాజిక అభివృద్ధి చెందాలని కోరారు .అందరికీ పక్కా ఇల్లు, మౌలిక సదుపాయాలు ,పౌష్టికాహారం, వృత్తి వైద్య నైపుణ్యం ,అందరికీ ఆరోగ్యం, వంటి 11 అంశాలు ఈ పథకాలలో ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, ఏవో తిరుపతి పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, ప్రజా ప్రతినిధులు ,సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## 5 వేలు మట్టి విగ్రహాలు పంపిణీ

### ఎన్డీఏ కూటమి నాయకులు

బొబ్బిలి, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:



వినాయక చవితి మహోత్సవం సందర్భంగా ముందు రోజు బొబ్బిలిలో మట్టి వినాయక విగ్రహాలు శుక్రవారం పంపిణీ చేశారు .ఈ మేరకు బొబ్బిలి కోట గడ్డ పై అతిరధుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బొబ్బిలి పులి బొబ్బిలి యువరాజ ఎన్డీఏ కూటమి తెలుగుదేశం బొబ్బిలి శాసన సభ్యులు బేబీ నాయన సమక్షంలో 5,000 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్వతిపురం మన్యం జిల్లా కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి, జనసేన పార్టీ రాష్ట్ర కార్య కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జనసేన జానీ కర్నెన సాయిపవన్ బొబ్బిలి కూటమి కార్యకర్తలు జనసైనికులు నాయుకులు పాల్గొన్నారు.

## మీది తెనాలే.. మాది తెనాలే..!

(మొదటి పేజీ తరువాయి)

మీరేం వర్రీకాకండి..మనం మనం బరంపురం.. మనకి మనం సాయం చేసుకుందాం.. కాకపోతే, మాది మాకు ఇచ్చేస్తే చాలు.. అంతేకాదు, కొత్తగా ఏమైనా డీల్ ఉంటే చూడండి, ఉభయులం కలసి చక్కబెట్టేద్దాం అని భారీ ఆఫర్ ఇస్తుండడంతో అవతలివాళ్ళు ఉబ్బితబ్బిబ్బు అవుతూ పరమానందంతో స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం పాట ఎత్తుకుంటున్నారు. నిన్నటిదాకా ఎవరి తాట తీసేస్తామని హుంకరించారో ఇప్పుడు వారితోనే చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడం చూసి, ముక్కున వేలేసుకోవడం నగర పౌరుల వంతవుతోంది. పెద్దాయన అశోక్ గజపతిరాజు హయాంలో ఎప్పుడూ టీడీపీ శ్రేణులు పార్టీ గీత దాటలేదు. ఆరాకొరా జరిగినా ఆయన ఉపేక్షించలేదు. మరి, ఇప్పుడు ఎందుకిలా జరుగుతోంది అన్నది చర్చనీయాంశంగా మారింది. పర్యవేక్షణ, నియంత్రణలో ఎమ్మెల్యే అధితి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితి మరింత చెయ్యిదాటక ముందే ఆమె కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. అలసత్వం జరిగితే పార్టీ భారీ మూల్యం చెల్లించక తప్పదన్న హెచ్చరికలు సాక్షాత్తూ ప్రజలనుంచి వినిపిస్తుండడం ప్రస్తావనార్హం.

## భోగాపురం విమానాశ్రయం 40 శాతం పనులు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచం నలుమూలల నుంచీ ఇక్కడ ఉద్యోగాలు చేసేందుకు తరలి వస్తారని చెప్పారు. దేశంలో పౌర విమానయాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందనీ, పదేళ్ళ క్రితం 74 ఎయిర్పోర్ట్ లు ఉండగా, ప్రస్తుతం 157 కి పెరిగాయని చెప్పారు. భవిషత్ లో వీటి సంఖ్య 400కు చేరుతుందని తెలిపారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన మొదటి రోజు నుంచే కలెక్టరేట్ ను క్యాంప్ ఆఫీసు గా చేసుకొని సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రకృతి విపత్తులను కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి బాధ్యతా రహితంగా, రాజకీయం చేస్తున్నారని అన్నారు. నష్టాన్ని అంచనా వేసిన వెంటనే, వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం సిద్దంగా ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ పర్యటనలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల శాసన సభ్యురాలు లోకం నాగ మాధవి, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, జిఎంఆర్ సీఈవో మనోమే రాయ్, సిడివో ఎం. కోటేశ్వరరావు, ఆర్డిఓ ఎంవి సూర్యకళ, తహసీల్దార్ సురేష్, ఇతర అధికారులు, జిఎంఆర్, ఎల్ అండ్ టి సంస్థల ప్రతినిధులు, టీడీపి నాయకులు పాల్గొన్నారు.

## చవితి సందడి షురూ..!

(మొదటి పేజీ తరువాయి)

వినాయకుని విగ్రహాలను భక్తులు ఉపయోగించేవారు. నేడు ఆధునీకరణ పద్ధతుల్లో పలు రసాయనాలతో కూడిన విగ్రహాలను తయారుచేసి వాటిని మార్కెట్లో వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. రసాయనిక విగ్రహాలు సముద్రంలో, బావుల్లో నిమజ్జనం చేస్తుండడం ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా మట్టి విగ్రహాలు ఉపయోగించి వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించాలని పర్యావరణ శాస్త్రవేత్తలు కోరుతున్నారు. బొజ్జ గణపయ్యను ఎంత పవిత్రంగా పూజిస్తారో.. అంతే పవిత్రతతో నిమజ్జనం చేయాలి. పర్యావరణ హితంగా తయారైన మట్టి గణపయ్యలతోనే ఇది సాధ్యమని పెద్దలు చెబుతున్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం...

(మొదటి పేజీ తరువాయి)

పూజలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, థర్మాకోల్ వాడొద్దని సూచించారు. మట్టి విగ్రహాలను వాడటం వల్ల, అవి పర్యావరణానికి హాని చేయకుండా, నీటిలో సులువుగా కరిగిపోతాయని చెప్పారు. మన భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సుమారు 8 వేల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. విజయనగరంలో ఆరు చోట్ల, గజపతినగరం, బొబ్బిలిలో కూడా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. డిఆర్ఓ ఎస్‌డి అనిత, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, డిఎంఅండ్‌హెచ్‌లో డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రను ఆనుకుని అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రాయలసీమలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వెల్లడించింది. దక్షిణ కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. వచ్చే రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. శుక్రవారం విశాఖతో పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసాయి.

## ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



ఆరిలోవ, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:

జీవీఎంసీ, 9వ వార్డు సింహగిరి కాలనీ వద్ద టిడిపి ప్రధాన కార్యదర్శి గెద్దవలస వెంకటరావు ఆధ్వర్యంలో సుమారు 200 మట్టి వినాయకుని ప్రమిదలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యతిదులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మిసన్యాసిరావు, 9వ వార్డు ఇంచార్జు బుడుమూరిగోవింద్ పాల్గొన్నారు. ఈకార్యక్రమమంలో ఐటిపి అధ్యక్షులు బాదరు బాలరాజు, 12వ, వార్డు అధ్యక్షులు గాడిసత్యం, రాయి అప్పాజి, ఒమ్మిరాజు, అనుగుపల్లి ఈశ్వరరావు, నల్లా ఈశ్వరరావు, బట్టాను రాంబాబు, భక్తులు, పెద్దమొత్తంలో పాల్గొన్నారు.

## ఉత్సవాలకు సిద్ధమవుతున్న వినాయక మండపాలు



దేవరాపల్లి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్

మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు కొలువుతీరడానికి అవసరమైన మండపాలను నిర్వాహకులు ఇప్పటికే ముస్తాబు చేశారు. మండల కేంద్రం దేవరాపల్లితో పాటు వివిధ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలకు అవరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా, ఉత్సవాలను ఆ వినాయకుడే నిర్విఘ్నంగా జరిగేందుకు సహకరిస్తాడంటూ భక్తులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేవరాపల్లి, రైవాడ అతిథి గృహ కార్యాలయం ఆవరణతో పాటు, కుమ్మరి వీధిలోని వినాయక దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరుగుతాయని అర్చకులు చెప్పారు. కాగా వినాయక నవరాత్రి సందర్భంగా భక్తులంతా మట్టి వినాయకుడ్ని పూజించాలంటూ నేతాజీ విద్యాలయానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు మట్టి ప్రతిమలను అందజేశారు. వారితోపాటు స్థానిక వ్యాపారి మోరా అప్పలకొండ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

# ఐతమ్ లో విద్యార్థులకు శిక్షణ



టెక్కలి, సెప్టెంబరు 6, మేజర్‌న్యూస్:

ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ ఏడాదికి చెందిన 143 మంది ఈఈఈ విద్యార్థులకు ఎపిఎస్ఎస్ఎస్ సిఎంఎస్ ఎక్స్ లెన్స్ సెంటర్లో 'పిసిబి-డిజైన్' అనే అంశంపై వారం రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. లైవ్ వైర్ సాఫ్ట్వేర్, డిజైన్ ఆఫ్ వేరియస్ సర్క్యూట్స్ ఇన్ లైవ్ వ్ర్ సాఫ్ట్వేర్, పిసిబి-వైజ్డ్ సాఫ్ట్వేర్, పిసిటె-లేబెట్స్ డిజైనింగ్ వంటి అంశాల్లో శిక్షణ పొందడం వల్ల ఆయారంగాల్లో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.ఈ తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఈఈఈ హెచ్చడి డాక్టర్ డి.విజయ్కుమార్, ఎపిఎస్ఎస్ఈసీ స్పోక్ డాక్టర్ బి.రామారావు, ఈఈఈ కో-ఆర్డినేటర్ జి.అశోక్, సిఎంఎస్ సెక్షన్ కో-ఆర్డినేటర్ కె.బి. అనూష, ఎపిఎస్ఎస్ఎసి శిక్షకులు సిహెచ్ సంతోష్లు పర్యవేక్షణలో ఈ తరగతులు జరుగుతున్నాయని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వర రావు తెలిపారు.

## నిరుపయోగంగా మారిన వరి నూర్పు రోలర్లు

### లబో దిబో మంటున్న తయారీ దారులు



తెర్లాం, సెప్టెంబరు 6, మేజర్‌న్యూస్:

గత సుమారుగా పదేళ్ల క్రితం వరి చేలు నూర్పూ కోసం తయారు చేసిన సిమెంట్ రోలర్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని వేల రూపాయలతో తయారు చేసుకున్న రోలర్లు మూలకు చేరడంతో వాటిని తయారు చేసుకున్న రైతులు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ యాంత్రీకరణ వస్తువులు రావడంతో వీటిని నూర్పు కల్లాలలోనే ఓ మూలకు నెట్టి పడేసారని వాటిని ఏంచేయాలో తెలియని అయోమయంలో కొట్టు మిట్టాడుతున్నామని పాముల వలస కాగాం నేమ లాం చుక్కవలస పె రుమాలి తదితర గ్రామాల రైతులు వెతలు చెందుతున్నారు. ఒక్కొక్క రోలారుకి ఆ రోజుల్లో సుమారు రెండు వేల రూపాయలతో తయారు చేయించామని ప్రస్తుతం వాటిని ఏం చేయాలో తెలియడం లేదని వారు తమ విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరుపయోగంగా మారిన రోలర్లు వాటిని వినియోగించుకునే మార్గాన్ని గాన్ని లేదా వాటిని తరలించి మార్గాన్ని గాని చూపాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

## చిత్ర సీమలోకి మన టెక్కలి చిన్నోడు

టెక్కలి, సెప్టెంబరు 6, మేజర్‌న్యూస్:



టెక్కలికి చెందిన కోళ్ల గణేష్ (చిన్న) హీరో గా పరిచయం అవుతూ స్పీడ్ 220 అనే చిత్రం భవాని సినిమాస్ లో విడుదల సందర్భంగా టెక్కలి లో పండగ వాతావరణం నెలకొంది. విజయలక్ష్మి ప్రొడక్షన్ లో హర్ష బెలగం దర్శకత్వం లో ఈ చిత్రం రూపొందింది. స్థానిక వ్యక్తి హీరో కావడంతో స్నేహితులు అభిమానులు టెక్కలి ప్రజలు పెద్ద ఎత్తున ఈ చిత్రాన్ని వీక్షించటానికి వచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ ఫ్యాన్స్ హంగామా చేశారు. టెక్కలి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కోళ్ల బ్రదర్స్ హీరో బ్రదర్ కావడంతో పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు కూడా ఈ సినిమా రిలీజ్ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా కేక్ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. హీరో గణేష్ కు ఫ్యాన్స్ పాలాభిషేకం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ సినిమా విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు టెక్కలికి చెందిన ఒక హీరో వెండితెరపై కనిపించడం చాలా ఆనందంగా ఉందంటూ పలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోళ్ల కామేష్. కోళ్ల వసంత్ ,కోళ్ల లవకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బగాతి శేషగిరిరావు, మల్ల బాలకృష్ణ, రెయ్య ప్రీతిష్ చంద్ర మామిడి రాము దల్లి ప్రసాద్ రెడ్డి, లాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

బాడంగి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



మండలంలోని ముగడ గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ గ్రామ రైతులు వై రవణమ్మ. జి చిన్నమ్మలు వరి పొలంలో కవర్లు పెట్టి పేడ మూత్రం ఇంగువ ద్రావణం ను తయారుచేసి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు పది లీటర్ల నీరు 10 లీటర్లు మూత్రం 10 కేజీల పేడ 200 గ్రాములు ఇంగువ. 100 గ్రాముల సున్నం తీసుకుని అన్నీ కలిపి ఉదయం మధ్యాహ్నం బాగా కలపాలని మరుచటి రోజు వడకట్టి ఇంగువ మారుగాపెట్టి నీళ్లు కలపాలి తద్వారా పేడ మూత్రము ఇంగువ ద్రావణం తయారవుతుందని తెలిపారు ఒక ఎకరానికి పది లీటర్లు పేడ మూత్రము ఇంగువ ద్రావణం 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని కోరారు పంట కాలములో రెండు మూడు సార్లు పిచికారి చేయాలని దీని వల్ల రెక్కల పురుగులు ఈ వాసనకు పంటల మీద గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు. పంటలలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తుంది. ఈ పోషకాలు వలన పంటల ఆరోగ్యంగా పెరిగితాయని రైతులు కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవలసలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ఆమదాలవలస రూరల్, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



ఆమదాలవలస మండలం జొన్నవలస గ్రామపంచాయతీలో అమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సర్పంచ్ గొంటి అనిల్ కుమార్ అన్నారు. విగ్రహాల తయారీలో వాడే ప్లాస్టర్ ఆఫ్ పారిష్ రసాయనాలతో జీవరాశులకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. వ్యర్థ రసాయనాలతో కలిసిన విగ్రహాలు నిమజ్జనం చేస్తే నీటివనరులు కలుషితం ఆయి జీవరాసులకు హాని కలుగుతుందన్నారు. పర్యావరణం పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, పెద్దలు, పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆహార సామగ్రి రవాణా



ఆమదాలవలస, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:

ప్రకృతి వైపరీత్యం సందర్భంగా విజయవాడ వరదలలో నష్టపోయిన బాధితులను ఆదుకోవడం కోసం ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలో తమ వంతు సహాయంగా ఆహారపు సామాగ్రిని వరద బాధితుల కోసం రవాణా చేశారు. ఈ వాహనాన్ని విజయవాడ తరలించేందుకు ఎమ్మెల్యే రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆహార సామాగ్రిని వరద బాధితులకు పంపిణీ చేయాలని సూచించారు. ఆపద సమయంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వరదల కారణంగా ఆస్తులు, ప్రాణనష్టాలు జరగడంతో దాతల ముందుకు వచ్చి సేవా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### మట్టి విగ్రహాలు తోనే వినాయక పూజలు నిర్వహించాలి : ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:

పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గొల్లపల్లి మరియు కోట జంక్షన్ క్రేజీ గిఫ్ట్స్ షాప్ దగ్గర జనసేన బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని బొమ్మల పంపిణీ కార్యక్రమం నకు ఎమ్మెల్యే బేబినాయన ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాలు ను పంపిణీ చేశారు. అలాగే ఐటీఐ కాలనీ యూత్ మరియు ఎన్ డి ఏ మరియు ఎన్డీఏ నాయకులు ఆహ్వానం మేరకు నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి సన్నిధానం ఓపెనింగ్ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే శ్రీ బేబీ నాయన మరియు జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీ బాబు పాలూరు పాల్గొనడం జరిగింది. శ్రీ బాబు పాలూరు అయ్యప్ప మండపం నిమిత్తం పది వేల రూపాయలు విరాళం శ్రీ బేబీ నాయన గారి సమక్షంలో కమిటీ వారికి అందజేసారు. అలాగే ఐటీఐ కాలనీ ప్రజలకి వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని బొమ్మలను పంపిణీ చేయడం జరిగింది. బొబ్బిలి టౌన్ కోరాడ వీధి నాయకులు జనసేన పార్టీ రాష్ట్ర



కార్యనిర్వాహణ కార్యదర్శి శ్రీ బాబు పాలూరు గారిని మర్యాదపూర్వకంగా కలిసి రేపు జరగబోయే వినాయక చవితి వేడుకలకు ఆహ్వానించడం జరిగింది.

# కిడ్నీ రోగికి బాసటగా నిలిచిన మేమున్నాం సేవా సంఘం

### -జే ఆర్ పురం ఎస్.ఐ చిరంజీవి చేతులమీద ఆర్థిక సాయం అందజేత



రణస్థలం, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:

మానవ సేవయే - మాధవ సేవ" అనే నినాదంతో ముందుకు వెళ్తున్న "మేమున్నాం" సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పచ్చిగుళ్ళ సాయిరాం తన సంఘం తో ఆపదలో ఉన్న అనేకమందికి మేమున్నామంటూ ఆదుకుంటున్నారు. రెండు కిడ్నీలు పాడైన ఓ ప్రైవేటు టీచర్ కి చేయూత నిచ్చి దాతృత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక జే ఆర్ పురం గ్రామంలో 20 సంవత్సరముల కిందట బ్రతుకుతెరువు కోసం వెస్ట్ బెంగాల్ నుంచి వివియన్,రూప టీచర్ కుటుంబం రణస్థలం మండలం జి ఆర్ పురం లో నివాసం ఉంటున్నారు. భార్య భర్తలు ఇద్దరూ ప్రైవేటు స్కూలులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాఫీగా సాగుతున్న వారి కుటుంబానికి రెండు సంవత్సరముల క్రిందట ఇంటి యజమాని వివిఎన్ కుకే మాస్టర్ కి కిడ్నీ వ్యాధి రూపంలో ఒక మహమ్మారి దాపురించింది. అప్పటినుండి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. దిక్కు తోచక నిస్సహాయ స్థితిలో రెండు కిడ్నీలు పాడై మంచంపై పడి ఉన్న వివిఎన్ మాస్టార్ని మేమున్నాం సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాయిరాం వివియన్ మాస్టర్ కి డయాలసిస్ నిమిత్తం కొంత ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయడానికి వారికి అంత స్తోమత లేక దాతలు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో మేమున్నాం సేవా సంఘం సభ్యులు తలో చేయి వేసి కొంత మొత్తాన్ని డొనేషన్ చేసి సుమారుగా ఇరవై వేల రూపాయల మొత్తాన్ని స్థానిక జేఆర్ పురం ఎస్సై చిరంజీవి చేతుల మీదుగా వివిఎన్ మాస్టర్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో యువటీం- అంజి బాబు,ఎన్.కళా వెంకట రావు,ఎస్ కే బజార్ చంద్రశేఖర్,తోటి ఉపా ద్యాయ సిబ్బంది ఎన్.ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# "ఈదులు గాలులకు విరిగిన అరటి పంట"

### నేలకొరిగిన మొక్కజొన్న- బోరున విలపిస్తున్న రైతన్న

మక్కువ, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:

ఉరుముఉరిమి....మంగళం మీద పడినట్టు.! అన్నదాత ఏ కాలంలోనైనా.. ఏ విధంగానైనా నష్టం చవి చూడక తప్పడం లేదు. కాలంగాని కాలంలో ఈదులుగాలతో కూడిన భారీ వర్షం కారణంగా చేతికందిన అరటి పంట విరిగిపోయింది. మొక్కజొన్న పంట నేలమట్టమయింది. చేతి కందిన పంట భూమి నేలపాలు కావడంతో అన్నదాత ఆక్రందనకు అడ్డు అదుపు లేకుండా పోయింది. వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలకు మదుపులు పెట్టగా?, తీరా పంట చేతి కొచ్చిన సమయానికి మాయదారి ప్రకృతి... అన్నదాతపై పగబట్టి పంటను నేలమట్టం చేస్తుంది. ఏటా అన్నదాతకు కష్టం తప్పడం లేదు. అయినా గతిలేక గత్యంతరం లేక పుడమి తల్లమ్మనే నమ్ముకొని కష్టాలకు నష్టాలను వ్యవసాయ రంగాన్ని ముందుకు సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఈదులు గాలులతో కూడిన భారీ వర్షానికి ఏడాది పొడుగుణా పిల్లాపాపలతో కష్టపడి పండించిన అరటి, మొక్కజొన్న పంట నేలమట్టమయింది. మండలంలోని శంబర గ్రామంలో గురువారం సాయంత్రం వీచిన ఈదుర గాలులకి అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మధ్యస్థంగా ఉన్న మొక్కజొన్న పంట కూడా నేల పాలుకావడం అన్నదాత ఆక్రందనకు అవధులు లేకుండా పోతున్నాయి. పంటను పండించి పిల్లాపాపలతో నాలుగు మెతుకులు తిందామన్న గంపెడు ఆశతో సేద్యన్నే నమ్ముకుంటే.? తీరా ప్రకృతి తమపై ఇలా పగ పట్టడం దారుణమని అన్నదాత విలపిస్తున్నాడు. ఈదులు గాలతో కూడిన భారీ వర్షానికి వనంగుడి సమీపంలో మరియు వెంగళరాయ ప్రాజెక్ట్ సమీపంలో గల అరటి పంటలతో పాటు మొక్కజొన్న పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈదురుగాలి కారణం గా విరిగిన అరటిపంటను, మొక్కజొన్న పంటలను ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించడం జరిగింది. రైతుకు జరిగిన నష్టంపై అధికారులు చర్యలు చేపట్టి పరిహారం అందించాలని రైతులంతా కోరుతున్నారు.



# గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

### ఎంపీడీవో గారికి సిపిఐ పార్టీ వినతి



బొబ్బిలిరూరల్, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:

బొబ్బిలి మండల పరిధిలో ఉన్నటువంటి గిరిజన గ్రామాలైన కృపవలస, దీవెన వలస, రామన్న వలస, సీయోను వలస, చిన్న అక్కేనా వలస గ్రామాలలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయాలను కోరుతూ బొబ్బిలిఎంపీడీవో కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే నివాసముంటున్న గిరిజన గ్రామాలను దగ్గరలో ఉన్నటువంటి పంచాయతీల్లో చేర్పించాలని పలుమార్లు ఉన్నత మరియు జిల్లా అధికారులకు తెలియజేసిన ఇంతవరకు గిరిజనుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడ వేసిన చందంగా ఉందని తెలిపారు .ఇప్పటికైనా అధికారులు స్పందించి దగ్గర్లో ఉన్నటువంటి కాసిం దొర వలస పంచాయతీలో చేర్పించాలని కోరారు. జిల్లా అధికారులు మరియు ఐటిడిఏ అధికారులు తక్షణమే స్పందించి. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలి. గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు మరియు విద్యుత్ సౌకర్యం లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని. ఈ కార్యక్రమంలో . సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. కోట అప్పన్న, సిపిఐ మండల నాయకులు బిహెన్, జీరా,కన్నయ్య, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం

### - కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్- రికార్డు స్థాయిలో 30వేల మట్టి విగ్రహాలు పంపిణీ

శ్రీకాకుళం, సెప్టెంబర్ 06, మేజర్‌న్యూస్:

మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ శ్రీకాకుళంలో ఏడు రోడ్ల కూడలి, మిల్లు జంక్షన్, పాత బస్టాండ్ వద్ద (శ్రీకాకుళం నియోజకవర్గంలో 12 ప్రదేశాలలో) ఈరోజు 30,000 మట్టి గణపతి విగ్రహాలు, వినాయక వ్రతకల్పం (పుస్తకం) పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా ప్రజలకు పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు పంపిణీ చేశారు. నగరంలోని ఏడురోడ్ల జంక్షన్, సూర్యమహల్, రామలక్ష్మణ, డే అండ్‌నైట్, పాతబస్టాండ్, 80 ఫీట్ రోడ్ జంక్షన్,బలగ జంక్షన్‌తో పాటు రూరల్ మండలంలోని సింగుపురం, సిలగాం సింగువలస,గారలోని శ్రీకూర్మం, గార, కళింగపట్నం తదితర ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సిక్కోలు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నియోజకవర్గంలోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో విగ్రహాలు అందించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ తోడుండే గొండు శంకరే నిజమైన నాయకుడని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టితో తయారు చేసిన గణపతిని పూజించాలన్నారు. మట్టి గణపతితో వినాయక చవితి విశిష్టతను పెంచేలా మనమందరం సమిష్టిగా కృషి చేయాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయకుని విగ్రహాలను పూజించాలన్నారు. కృత్రిమగా లభించే ప్లాస్టర్ ఆఫ్ పారీస్ లో జిప్సం, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాల వలన



పర్యావరణానికి హానికరమని, హానికర రసాయణాలతో తయారు చేసిన గణపతిని నిమర్జనం చేయడం వలన జలవనరులు కాలుష్యానికి గురికావడం జరుగుతుందని, వీటి వలన జల వనరుల నాణ్యత తగ్గడంతో పాటు వృక్ష, జంతు జీవనం పై ప్రభావం కలుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారీస్ లో జిప్సం, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాల వలన నీరు కాలుష్యం అవుతుందని, ఆ నీటిని మనం వినియోగించడం ద్వారా ఊపిరితిత్తులతో పాటు చర్మ, రక్త, కంటి సంబంధిత వ్యాధులు ఇతర సమస్యలు వస్తాయన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ విగ్రహాల తయారీకి సహజ సిద్ధమైన రంగులను, ప్రకృతి తో తయారయ్యే పత్తి , నారా వంటి పదార్థాలను వినియోగించుకోవాలని పర్యావరణ పరిరక్షణ వలన రానున్న భావితరాలకు మంచి వాతావరణం అందజేయగలమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ



అరకులోయ, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:

అరకులోయ నియోజకవర్గం పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు చెందిన గిరిజన గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. ధర్మశాస్త్ర ద్రవిడ సేవా సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు,కార్యనిర్వాహక సభ్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు వేర్వేరుగా మట్టి గణపతి ప్రతిమలను గిరిజనులకు అందజేశారు. పర్యావరణానికి హాని కలిగించని విగ్రహాలను పూజించాలని కోరుతూ పద్మాపురం,మాదల,అనంతగిరి,జనంగుడ, గంజాయిగుడ, గన్నెల,పెదలబుడు, దళపతిగుడ, డింగిరిపుట్టు,చొంపి,బోసుబెద తదితర గిరిజన గ్రామాల్లో మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మశాస్త్ర ద్రవిడ సేవా సంఘం అధ్యక్షుడు పి.కనక ప్రసాద్, ఉపాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.నాగబాబు ,వై.విజయలక్ష్మి,మొష్య. అనితకుమారి విడివిడిగా మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని భక్తులకు పిలుపునిచ్చారు. రంగులు, రసాయనాలతో తయారుచేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడి పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుందని వారు చెప్పారు. మట్టి గణపతి విగ్రహాలను పూజించే సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల్లోకి విస్తృతస్థాయిలో తీసుకొని వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని కనక ప్రసాద్, సూర్యనారాయణ, అనితకుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మశాస్త్ర ద్రవిడ సేవా సంఘం కార్యనిర్వాహక సభ్యులు దళపతి.రామరాజు, చల్లాశివ, సంతోష్ కుమార్, సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు ఎస్.రాజు,బి.లచ్చన్న, వి.కామేశ్వరరావు,ఎస్. అప్పారావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు పై ప్రజలకు అవగాహన: వైద్యాధికారిణి ఉమాదేవి



బొబ్బిలి, సెప్టెంబర్ 06, మేజర్‌న్యూస్:

పట్టణం లోని 16 వార్డులో బాడంగి మండల వైద్యాధికారిని డాక్టర్ శెట్టి ఉమాదేవి సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల పైన సీజన్లో వచ్చే చర్మ సంబంధ వ్యాధుల పైన అవగాహన కల్పించి రోగులకు తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. నివాస ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని మురుగునీరు నిలవ లేకుండా చూడాలని దోమలు వృద్ధి చెందకుండా ఉండాలని రోగులకు సూచించారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

### ఉపాధ్యాయ రొటేరియన్స్‌కు సత్కారం: ఎంపిడి ఓ రవికుమార్



బొబ్బిలి, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:

ఉపాధ్యాయులు సామాజిక నిర్మాతలని సమాజ నైతికాభివృద్ధి వారిపై ఆధారపడి వున్నదని బొబ్బిలి మండల అభివృద్ధి అధికారి పి. రవి కుమార్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ నేపథ్యంలో ఉపాధ్యాయులుగా వృత్తిని నిర్వహిస్తూ రోటరీ ద్వారా సమాజానికి సేవలందిస్తున్న ఉపాధ్యాయ రొటేరియన్స్ ను సత్కరించే కార్యక్రమాన్ని ఎన్ ఆర్ ఐ హాస్పిటల్ సమావేశ హాల్ లో క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ లునిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా విచ్చేసిన ఎంపిడిఓ రవికుమార్, రెసిడెంట్ డాక్టర్ రామ్ కుమారు లు రోటరీ ద్వారా సేవలందిస్తున్న డిస్ట్రిక్ట్ చైర్ జె సి రాజు, డాక్టర్ సజ్జ అప్పుల రాజు, ప్రవీణ్ కుమార్, శ్రీ దేవి , కృష్ణ మోహన్, ఐ.ఈ అర్ టి శివ కాంత్, ట్రైనింగ్ అధికారి ప్రభుత్వ ఐ టి ఐ లను సత్కరించి అంతర్జాతీయ రోటరీ సంస్థ జారీచేసిన ప్రశంసా పాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిని, ప్రకృతిని అగౌరవ పరచకూడదని ఉపాధ్యాయుడిని అగౌరవ పరిస్తే విద్యార్థికి, ప్రకృతిని అగౌరవ పరిస్తే సమాజానికి నష్టం వాటిల్లు తుందనిఅన్నారు. ఉపాధ్యాయులు గా ఉంటూ అంతర్జాతీయ రోటరీ ద్వారావివిధ రంగాలలో సమాజానికి సేవాలందించటం గొప్ప విషయమని అన్నారు.ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీ హరి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు లేనిదే సమాజమే లేదన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యనిర్వహణ కార్యదర్శి కె. రామ కృష్ణ, రోటరీ సభ్యులు ఉపాధ్యాయులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలను పూజిద్దాం

### పర్యావరణాన్ని కాపాడుకుందాం

బాడంగి, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ బాడంగి హై స్కూల్ ఉపాధ్యాయులువిద్యార్థులు కలిసి శుక్రవారం బాడంగి మెయిన్ రోడ్డుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి విగ్రహాలు పూజించండి పర్యావరణాన్ని కాపాడండి అనే తీమ్ తో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వినాయక మట్టి విగ్రహాలు,ప్లకార్డ్స్ తో అవగాహనా ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు మట్టి విగ్రహాలనే పూజించాలని, చెరువులు, ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు పర్యావరణాన్ని ఎక్కువగా హానికరమని పేర్కొన్నారు. పర్యావరణ హితాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలి అని వారు కోరారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం

### పర్యావరణాన్ని రక్షిద్దాం

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి.

నరసన్నపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



మట్టి వినాయకులను పర్యావరణాన్ని పరిరక్షిద్దాం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ షాపింగ్ కాంప్లెక్స్ అధినేత మావూరి వెంకటరమణ సిబ్బంది మట్టి వినాయక ప్రతిమలను ఎమ్మెల్యే కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి వినాయకుని పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మట్టి వినాయకుని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్రమాదకరమైన రసాయనాల నుండి రక్షణ పొందడం జరుగుతుందని అన్నారు అనంతరం నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోతుల రహదారికి తాత్కాలిక మరమ్మత్

### - సర్పంచ్ శంకర్ ఆధ్వర్యంలో స్టోన్ క్రషర్ మెటీరియల్‌తో పూడ్చివేత పనులు.

నరసన్నపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



నరసన్నపేట పట్టణానికి సుమారు 30 గ్రామాలతో రాకపోకల సంబంధం కలిగి స్థానిక కంబకాయ జంక్షన్ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గోతులమయంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని గమనించిన మేజర్ పంచాయతీ సర్పంచ్ బురల్లీ శంకర్, రోడ్డు మరమ్మతుల పనులను గురువారం నిర్వహింప చేశారు. స్టోన్ క్రషర్ మెటీరియల్ తో గోతులను పూడ్చే ఏర్పాట్లు చేయించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ పనులను నిర్వహించడం పట్ల స్థానికులు, ప్రయాణికులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

## గురుకులానికి వర్షపు అగచాట్లు

### - వర్షానికి నానుతున్న భవంతులు- ప్రమాదకరంగా వసతి గృహాలతో పాటు తరగతి గదులు- బిక్కు బిక్కు మంటున్న విద్యార్థులు

పూసపాటిరేగ, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:



మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయ భగవంతుడు శిథిలావస్థకు చేరాయి. జిల్లాలోనే అతి పెద్ద గురుకుల విద్యాలయమైన కొప్పెర్ల గురుకుల విద్యాలయం 1986లో భవంతులను నిర్మించారు. 26 ఎకరాలు విస్తీర్ణంలో విద్యార్థులు కావలసిన తరగతి గదులతో పాటు డార్మెంటరీలు, మరుగుదొడ్లు,, ఉపాధ్యాయులకు కావలసిన క్వార్టర్స్ విశాలంగా అప్పట్లో నిర్మించారు. అప్పటి నిర్మించిన భవంతులు శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నెల రోజులుగా వర్షాలు కూడా కురుస్తుండడంతో బలవంతులపై కప్పుతో పాటు లోపల కూడా గోడలు బీటలు వారి పెచ్చు పెచ్చులుగా ఊడిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థలో ఉన్న భవంతల స్థానంలో కొత్త భవనాలను నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

**శృంగవరపుకోట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



పట్టణంలోని దేవి కూడలిలో ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఏ వెంకట్రావు వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఆర్.టి.సి.డిపో మేనేజర్ కోటంశెట్టి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, పాదరసం, సీసం, రసాయనాల రంగులు, ధర్మాకోల్ వంటివి వాడి తయారుచేసిన వినాయక విగ్రహాల వలన జలవనరులు కాలుష్యమవుతున్నాయి. జీవవైవిధ్యం నశిస్తుంది. పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. మట్టివినాయక విగ్రహాలనే పూజిద్దాం అన్నారు. జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ పి.సన్ని బాబు, సీనియర్ అసిస్టెంట్ పి.వి.రావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గౌరీ శంకర్ కోలనీ, శ్రీనివాస కోలనీ తదితర వీధుల్లో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసారు. సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, పంచాయితీ మాజీ సభ్యుడు బొబ్బిలి అప్పారావు, హృషీకేశ్, లాస్య శ్రీ, రమణమ్మ, అన్నపూర్ణ, హనీ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడిఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ఐటీడిఏప్రాజెక్ట్ అధికారిగాయశ్వంత్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**సీతంపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



ఐటిడిఏ, సీతంపేట ప్రాజెక్ట్ అధికారిగా సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఐఏఎస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొండ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అందరి సహకారంతో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలు మారుమూల గిరిజన గ్రామాలకు అందేలా చర్యలు తీసుకొంటానని అన్నారు.ఏ ఓ విజయకుమారి పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### ఐసీడియస్ పీడీ రాణి

**మక్కువ, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీయస్ పీడీ (మండల ప్రత్యేక అధికారి) యం యన్ రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పనసబద్ర పంచాయతీలోని పోషకహార మాసోత్సవాలను సీడీపిఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో యంపిడివో చోడే సూర్యనారాయణ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకధికారిని మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన ప్రతీ బిడ్డకు అదనపు పౌష్టికాహారం అందివ్వాలన్నారు. ఆరోగ్యానికి పోషక విలువలుతో కూడిన ఆహారం అవసరాన్ని తెలియజెప్పడంతోపాటు, పోషక పదార్థాలు తీసుకోకపోతే వచ్చే రక్తహీనత, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, ఆ పిల్లలుకు సరైన ఎదుగుదల లేకపోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మాతా శిశు మరణాలను ఎలా తగ్గించవచ్చో! ఆకుకూరలు, కూరగాయలు, చిరుధ్యాన్యాలు, పండ్లు వాడుతూ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చునో! తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో యిచ్చే పౌష్టిక ఆహారం బాలింతలు, గర్భిణీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యంపిడివోతో కలసి సీడిపివో, సూపర్వైజర్లు గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలను జరిపించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు యన్ లీలావతి, పి రాజశ్రీ, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో తడిసి ముద్దయిన బొబ్బిలి

### స్టైల్ బజార్ వద్ద కూలిన భారీ ఫ్లెక్సీ - తప్పిన ప్రమాదం

ప్రమాదం జరిగితే గాని స్పందించని మున్సిపల్ అధికారులు

**బొబ్బిలి, సెప్టెంబర్06, మేజర్‌న్యూస్:**



బొబ్బిలి లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం తో పట్టణం తడిసి ముద్దయింది అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇందిరమ్మ కాలనీ,తారకరామ కాలనీ, ఐటీఐ కాలనీ, నాయుడు కాలనీ మరియు పట్టణం రోడ్లు వర్షం నీరు తో నిండుకుంది. భారీ వాహనాలు రాకపోకలు తో పూల్ బాగ్ రోడ్ గుంతలతో పరమాదకరంగా ఉంది. ఈ వర్షంతో గోతులు చెరువులు గా మారిపోయాయి. అనంతరం జెండా వీధి సమీపంలో స్టైల్ బజార్ వద్ద భారీ ఫ్లెక్సీ రోడ్డు పై పడి పోయింది.అయితే ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇందిరమ్మ కాలనీ లో భారీగా వర్షం కురవడం తో ఇంట్లోకి నీరు రావడం తో కుటుంబాలు ఆందోళన చెందాయ. దీంతో ఇంట్లో ఉన్న వర్షం నీటిని తోడు కుంటుంటున్నారు.

## కాయగూర పంటలకు బూజు తెగులు

### ఉద్యానవన శాఖ అధికారిణి భాను పుష్ప

**రావికమతం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాయగూర పంటలుకు బూజు తెగులు, కుళ్ళు తెగులు ఆశిస్తాయని ఉద్యానవన శాఖ అధికారిణి బాలు పుష్ప లీలావతి తెలిపారు. మండలంలో తోటకూర పాలెం తట్టబంద గుడ్డిప గ్రామాల లో సాగులో ఉన్న ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు. సందర్భంగా పొలాల్లో నీరు ఎక్కువగా ఉండాన్ని గమనించారు. తక్షణం ఈ నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. బూజు తెగులు, కుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ మందు మూడు గ్రాములు తీసుకొని లీటర్ నీటిలో కలిపి కాయగూరల పంటలపై పిచికారి చేయాలని తెలిపారు.

### యూ.గదబ వలస అంగన్వాడీలో

## ఫోషణ మహా కార్యక్రమం

**తెర్లాం, సెప్టెంబరు 6, మేజర్‌న్యూస్:**



పోషణ మహా మాసోత్సవా లలో భాగంగా శుక్రవారం మండలం లోగల యు. గద బ వలస గ్రామ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిం చారు. పి.ఎం.జన్ మన్ కార్య క్రమంలో భాగంగా రిక్వైర్మెంట్స్ పైన బాడంగి ఐసిడిఎస్ పి. ఓ.కే. రాజ్య లక్ష్మి అంగన్వాడీ కార్యకర్తను అడిగి తెలుసు కున్నారు. అందుకు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ పక్కా అంగన్వాడీ భవనం మంజూరు చేయించాలని ఆమెను కోరారు. అందుకు ఆమె మాట్లాడుతూ తప్పని సరిగా భవనం మంజూరుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి తనవంతు సహకారం అందిస్తామని ఆమె వారికి భరోసా ఇచ్చారు. అనంతరం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో వారితో పాటు సూపర్వైజర్ వెంకట లక్ష్మీ పంచాయితీ సెక్రటరీ ఆయా గర్భిణీలు బాలింతలు ప్రీ స్కూల్ పిల్లలు తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకొస్తాం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్- శ్రీకాకుళం నుంచి విజయనగరానికి కొత్త బస్సు ప్రారంభం

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 06, మేజర్‌న్యూస్:**



ఆర్టీసీని పూర్వవైభవం దిశగా నడిపించే బాధ్యత అధికారులతో పాటు ప్రతి ఉద్యోగిపై ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం నుంచి విజయనగరానికి నూతన బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రగతి రథచక్రానికి సారధులు కింది స్థాయి ఉద్యోగులే అన్నారు. వారు అంకితభావంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులుగా మనపై ఉందన్నారు. ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇటీవల కొత్త బస్సులను ప్రారంభించామని వివరించారు. ఆర్టీసీని ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలని, ఆర్టీసీ ఆవరణలోని ఖాళీ స్థలాల్లో కమర్షియల్ భవనాలు నిర్మాణం చేపడితే ఆర్టీసీ ఆదాయం చేకూరుతుందని చెప్పారు. గడచిన ఐదేళ్లలో ప్రజలకు దూరమైన ప్రజా రవాణా సంస్థను ప్రజలకు చేరువ చేస్తూ ప్ర ధాన ఆదాయ వనరుగా ఆర్టీసీని తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మౌళిక సదుపాయాలు కల్పించిన అవసరం ఉందని, వాటిపై ఆర్టీసీ అధికారులతో కూడా చర్చించానని త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామన్నారు. దీనిపై విధి విధానాలను టీడీపీ అధిష్ఠానం రూపొందిస్తోందని వివరించారు. మహిళలకు శుభవార్త చెబుతామని చెప్పారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ డిపో మేనేజర్లు, కార్మికులు ఉన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో పర్యావరణ హితా ప్రదర్శన



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 06, మేజర్‌న్యూస్:**

ప్రభుత్వ మహిళ కళాశాల శ్రీకాకుళం నందు తేదీనవృక్ష శాస్త్ర విభాగం వారు మరియు ఎన్ ఎస్ ఎస్ యూనిట్స్ వారు కలిసి మట్టి వినాయకుని బొమ్మలను విద్యార్థినిలతో తయారు చేయించారు. అదేవిధంగా 21 రకాల పత్రిని సేకరించి ప్రదర్శించారు .ఈ "పర్యావరణ హిత" కార్యక్రమానికి హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ - పర్యావరణ హితానికి మట్టి వినాయకుని బొమ్మలే మనం తయారు చేసుకోవాలని, అదేవిధంగా 21 రకాల "పత్రి"లో ఉండే ఔషధ గుణాలను మనం తెలుసుకోవడం ద్వారా వినాయక చవితి పండుగ విశిష్టత తెలుస్తుందని అన్నారు. ఇటువంటి "పర్యావరణ హిత ప్రదర్శన" చేసిన విద్యార్థులను చేయించిన అధ్యాపకులు ఎస్ .రుద్రమరాణి ,శ్రీమతి సునీత, మొదలైన అధ్యాపకులను ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ను ప్రిన్సిపాల్ ప్రశంసించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. శంకరనారాయణ , అకాడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ .కృష్ణారావు ,ఐ .క్యు. ఏ .సి కోఆర్డినేటర్ ఎస్. పద్మావతి , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీమతి టి.ఆదిలక్ష్మి , కళాశాలలోని అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కదిలిన మేజర్ పంచాయతీ యంత్రాంగం

- ఎమ్మెల్యే సూచనలతో రంగంలోకి అధికారులకు
- కళాశాల రహదారిలోని షాపు యజమానులకు అవగాహన

**నరసన్నపేట, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



నరసన్నపేట పట్టణంలోని కళాశాల రహదారిలో వ్యాపార కార్యకలాపాల వల్ల జరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు, రాజుల చెరువు పరిసర ప్రాంతాలను దుర్గంధ భరితంగా మారుస్తున్న వైనంపై గ్రామపంచాయతీ దృష్టి సారించింది. పలుమార్లు పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు స్పందించిన శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కళాశాల రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు, రాజుల చెరువు పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించిన సూచనల మేరకు నరసన్నపేట మండల అభివృద్ధి అధికారి, ఈ ఓ పి ఆర్ డి, నరసన్నపేట పట్టణ ప్రత్యేక అధికారి కవిత, ఈవో ద్రాక్షాయని, సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, గురువారం ఆ ప్రాంతాలను పరిశీలించి దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. కాయగూరలు దుకాణాలు వల్ల ప్రత్యేక చెత్త డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలని, వ్యర్ధాలను రోడ్డుపై వేయరాదని, వ్యర్థాలకోసం పశువులు పరిసర ప్రాంతాల్లో సంచరించడం వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని, రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, వ్యర్థ పదార్థాలను రాజుల చెరువు లో డంప్ చేయడం వల్ల చెరువు కలుషితంగా, దుర్గంధ భరితముగా మారి పరిసరాలన్నీ కలుషితమైపోతున్నాయని అందువల్ల వ్యాపారులు కచ్చితంగా గ్రామపంచాయతీ రూపొందించిన నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల రహదారి వెంబడి భారీ వాహనాలు బజార్ లోపలికి రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, దానికోసం సమావేశంలో చర్చించి త్వరలో నిర్ణయం అమలుపరుస్తామని ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కృష్ణ బాబు వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు ప్రజలు సహకరించాలని గ్రామపంచాయతీ తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవోలను కాదని ఉపాధ్యాయుల కేటాయింపు తగదు



**ఆమదాలవలస రూరల్, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**

ప్రభుత్వ జీవోలను కాదని విద్యాశాఖ అధికారులు ఏ ప్రాతిపదికన పని సర్దుబాటు పేరుతో తమ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు సర్దుబాటు చేస్తున్నారని చీమలవలస గ్రామ సర్పంచ్ సనపల చల్లన్నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు మండల విద్యాశాఖ అధికారిని నిలదీశారు. ఆమదాలవలస మండలం చీమలవలస గ్రామంలో గల మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ సభ్యులు శుక్రవారం నిరసన చేపట్టారు. పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు 33 మంది పిల్లలు ఉన్నారని, 6 7 8 తరగతిలో కలిపి 30 మంది ఉన్నారని, మొత్తం పాఠశాలలో 63 మంది పిల్లలు చదువుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ పాఠశాలకు ప్రభుత్వం ఏడుగురు టీచర్లను మొదట్లో కేటాయించిందని అన్నారు. ఇందులో ఒక టీచర్ ఇటీవలే పదవి విరమణ పొందారని అన్నారు. మిగిలిన ఆరుగురు టీచర్లలో నలుగురిని పని సర్దుబాటు పేరుతో చీమలవలస నుంచి బదిలీ చేశారని వాపోయారు. పని సర్దుబాటు బదిలీలో వెళ్లిన నలుగురిలో ముగ్గురు లక్ష్మీ నగర్ ప్రభుత్వ పాఠశాలకు, మరొకరిని గేటు లో ప్రభుత్వ పాఠశాలకు బదిలీ చేశారని అన్నారు. ఆరుగురిలో నలుగురు బదిలీపై వెళ్లిపోతే ఇద్దరు మాత్రమే తమ పాఠశాలలో ప్రస్తుతం ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఉన్న ఇద్దరిలో ఒకరు మెడికల్ లీవ్ పై ఉన్నారని అన్నారు. పని సర్దు బాటులో చీమలవలస పాఠశాలకు ముగ్గురు ఎంటిఎస్ టీచర్లను వేశారని అన్నారు. ఈ విషయమై పాఠశాల వద్ద ధర్నా చేపట్టి ఎంఈఓ ను నిలదీశారు. చీమలవలస పాఠశాలలో గల తెలుగు లాంగ్వేజ్ పండిట్ టీచర్ కు పని సర్దుబాటు జీవో వర్తించదని అన్నారు. మరి ఏ జీవో ప్రకారం లాంగ్వేజ్ పండిట్ ను లక్ష్మీ నగర్ కు వేశారో తెలపాలని ఎంఈఓ ను నిలదీశారు. జీవోను కాదని ఏ ప్రాతిపదిక ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు చెప్పాలని సర్పంచ్ సనపల చల్లన్నాయుడు విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్నప్పటికీ వారికి సరిపడా విద్యార్థులు లేకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్య బలోపేతం కోసం కృషి చేస్తుంటే అధికారులు ఇలా వ్యవహరించడం సరిపోదని మండిపడ్డారు.

## చీడికాడ జనసేన మండల పార్టీ అధ్యక్షులు తొలగింపు: రాయపురెడ్డి కృష్ణ

**మాడుగుల, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**

చీడికాడ మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షులు గంటల మూర్తిని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల ప్రకారం తొలగించడం జరిగిందని మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ తెలిపారు. శుక్రవారం మాడుగుల మండలం ఘట్ రోడ్డు జంక్షన్లో జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జనసేన పార్టీకి సంబంధించి గంటల మూర్తి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నట్టు జిల్లా అధ్యక్షులుదృష్టికి రావడంతో అతనిని పదవి నుండి తొలగించడం జరిగిందన్నారు. త్వరలో చీడికాడ మండల జనసేన పార్టీ అధ్యక్షుడిని నియమిస్తామన్నారు. జనసేన పార్టీకి సంబంధించి ఎవరైనా వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు గ్రెట్టి శివాజీ, మండల ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, కె.కోటపాడు మండల ప్రధాన కార్యదర్శి కుంచా అంజిబాబు, యువజన అధ్యక్షులు పడాల చాణక్య, జనసేన కెవి.మూర్తి పాల్గొన్నారు.



# ఘాట్ రోడ్డులో రాత్రుళ్లు ప్రయాణించవద్దు: సిఐ

**అరకులోయ, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



అరకులోయ ఘాట్ రోడ్డులో రాత్రి సమయాల్లో ప్రయాణించవద్దని ప్రయాణికులకు అరకులోయ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి సూచించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో శుక్రవారం రాత్రి మాట్లాడుతూ ఘాట్ రోడ్డులో రాత్రుళ్లు ప్రయాణించడం శ్రేయస్కారం కాదన్నారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఘాట్ రోడ్డులో ప్రమాదం పొంచి ఉందని, ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండ చరియలు తడిసి ముద్దయి జారిపడే ప్రమాదం లేకపోలేదని, అదేవిధంగా రోడ్డుకు ఆనుకొని ఇరువైపుల ఉన్న పలు రకాల వృక్షాలు నేలకొరిగే ప్రమాదం కూడా ఉందని ఆయన తెలిపారు. కొండలు, గుట్టలపై భాగం నుంచి వరద నీరు రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఘాట్ రోడ్డు అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. ఈమేరకు రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ మార్గంలో ఎవరు ప్రయాణించరాదని ఆయన చెప్పారు. ఘాట్ రోడ్డు ప్రయాణంపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ నిషేధం విధించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎవరి సహాయం లేకుండా గెడ్డలు,వాగులు దాటే ప్రయత్నం చేయరాదని, వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద తల దాచుకునే ప్రయత్నం చేయవద్దని, సురక్షిత ప్రాంతాల్లో సాధ్యమైనంత వరకు ఉండే విధంగా చూడాలని ఆయన చెప్పారు. వినాయక చవితి వేడుకలలో భాగంగా గణేష్ విగ్రహాల నిమజ్జనంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులకు ఆయన సూచించారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణమే పోలీసులకు సమాచారం అందించి, సహాయ సహకారాలు తీసుకోవాలని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. హిమగిరి తెలిపారు.

## పరమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

**బొబ్బిలి, సెప్టెంబర్07, మేజర్‌న్యూస్:**



బొబ్బిలి పట్టణం శ్వేతా చలపతి స్కూల్, కృష్ణ థియేటర్ రోడ్డు, మార్కెట్ నుండి వెళ్లే రోడ్డు,మూడు రోడ్లకు మధ్యలో ఉన్న పాత కరెంట్ బంక్ ట్రాన్స్ఫారం ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పరిశీలించి చూస్తే కొన్ని ప్రమాదపు దృశ్యాలు కనిపిస్తాయి. శుక్రవారం భారీ వర్షంతో అప్పుడే స్కూల్ విడిచిపెట్టిన టైం ట్రాఫిక్ జామ్ లో స్కూల్ పిల్లలు, పాదచారులు,వాహనదారులు, ఒక్కసారిగా రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది.కరెంటు స్తంభాలు పట్టుకొని పిల్లలు వెళ్తున్న పరిస్థితి ఈ వీడియోలో కనిపిస్తుంది. ప్రమాదప అంచుల్లో ఉన్నప్పుడే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

## కళ్యాణపులోవ రిజర్వాయర్ నీరు నదిలోకి విడుదల

**రావికమతం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



మండలంలో కళ్యాణపులోవ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడుదల చేస్తున్నామని ఏ ఈ సత్యనారాయణ దొర తెలిపారు. ఈ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 460 అడుగులు కాగా శుక్రవారం మధ్యాహ్నంనానికి 458. 90 అడుగుల స్థాయికి నీటిమట్టం చేరుకొందన్నారు. ఇన్ ఫ్లో 50 క్యూసెక్కులు ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా రెండు గేట్లు ఎత్తి నీరు నది లోకి విడుదల చేస్తున్నామని చెప్పారు . ఈ కారణంగా సర్పా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## అన్న క్యాంటీన్- అన్న సమారాధనకు పది వేలు విరాళం

ఎమ్మెల్యే బేబినాయనకు చెక్కను అందజేసిన గంట

**బొబ్బిలి, సెప్టెంబర్ 7, మేజర్‌న్యూస్:**



బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ అన్న సమారాధన కు పది వేలు విరాళం శుక్రవారం అందించారు. ఈ మేరకు కోటలో గంట సత్యవతి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు గంగరాజు పది వేల చెక్కను ఎమ్మెల్యే బేబినాయన కు అందజేశారు.

## పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుదాం

**టెక్కలి, సెప్టెంబరు 6, మేజర్‌న్యూస్:**



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లి ఆవరణలో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడ్డానికి పిల్లలలో పర్యావరణ పట్ల అవగాహన ఏర్పరచడానికి మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులతో తయారు చేయించి గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లడం జరిగింది గ్రామంలో కూడా మట్టి వినాయకుడు తయారు చేయడం పట్ల ప్రయోజనాలు వివరించడం జరిగింది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన వినాయకుడు పర్యావరణానికి అత్యంత హాని చేస్తుందని తెలియజేయడం జరిగింది అందుకే తప్పనిసరిగా మట్టి వినాయకుని మాత్రమే పూజించాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం అనురాధ ఇతర ఉపాధ్యాయులు జగదీశ్వరరావు ,దాలయ్య, కె నారాయణ రావు పి చిన్నారావు,మురళీకృష్ణ, ఋషి, బగాది ఆనందరావు,జ్యోతి, సుధారాణి, సిహెచ్ భారతి ,టి వైకుంఠ రావు ,నారాయణరావు ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో ఒక రోజు ఆలస్యంగా ఉపాధ్యాయ దినోత్సవం

**రావికపదం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు జగన్నాథ నాయుడు ,మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు బి మహాలక్ష్మి నాయుడు, టి అర్జాపురం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గుంటూరు రామారావు బుచ్చయ్యపేట భవిత కేంద్ర ఉపాధ్యాయుడు దేవుడు నాయుడు లను భవిత కేంద్రానికి చెందిన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పరంగా అమలులో ఉన్న సంక్షేమ పథకాలు, రాయితీలు, నూరు శాతం తమకు మంజూరు అయ్యేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు సన్మానించుకోవడం ఆనందంగా ఉందని పలువురు దివ్యాంగుల తల్లిదండ్రులు అన్నారు.

### కొండను ఢీకొన్న లారీ

## డ్రైవర్ మృతి, క్లీనర్‌కు గాయాలు

**పార్వతీపురం, సెప్టెంబర్ 6, మేజర్‌న్యూస్:**



చత్తీస్గఢ్ రాష్ట్రం నుంచి శ్రీకాకుళం జిల్లా రాజాం వెళుతున్న కమలా పళ్ళు లారీ అదుపుతప్పి కొండని ఢీకొనడంతో డ్రైవర్ సాహెబ్ 38 మృతి చెందగా క్లీనర్ శంకరకు తీవ్ర గాయాలయ్యాయి . గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పాచి పెంట పోలీసులు తెలిపారు . పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి, చత్తీస్గఢ్ నుంచి కమలా పళ్ళు తో వెళుతున్న లారీ అదుపు తప్పడంతో కొండను డి కొంది. ఈ సంఘటనలో డ్రైవర్ సాహెబ్ అక్కడికక్కడ మృతిచెందగా క్లీనర్ శంకరకు తీవ్ర గాయాలయయి. గాయపడిన క్లీనర్ను మెరుగైన వైద్యం కోసం సాలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలించిడం జరిగిందని పాచిపెంట పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాచిపెంట పోలీసులు తెలిపారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 05, మేజర్‌న్యూస్:**

పౌష్టికాహార మాసోత్సవాలు 2024, సెప్టెంబర్ 1 నుండి 30 సెప్టెంబర్ వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా 4వ తేదీన శ్రీకాకుళం అర్బన్ ప్రోజెక్టు, గూనపాలెం సెక్టారు, దమ్మలవీధి, 29వ వార్డు, మెర్జింగ్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా ఆ సెక్టార్ సూపర్‌వైజర్ బి. యోగీశ్వరమ్మ ఆ ఏరియాలో లబ్ధిదారులందరికి పౌష్టికాహారం అనేది ఖరీదైన ఆహారం కాదు. అతి తక్కువ ధరలకు మనకు లభించును చిరుధాన్యాలు కొర్రలు, రాగులు, సజ్జలు మొదలైనటువంటివి మరియు ఆకుకూరలు, జామకాయ, ఉసిరికాయ మొదలగునవి, మాంసాహారం ఇలాంటి ఆహార పదార్థాలలో మనకు కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ మణికంఠ, ప్రవీణ్, మూర్తి, నితీష్ అలాగే సచివాలయం ఎమ్.ఎస్.కె. పద్మజ, అంగన్వాడీ టీచర్స్ కె. పార్వతి, ఎల్.జ్యోతి, హెల్పర్స్, శశికళ, శారద పాల్గొన్నారు.